వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



ఇందిరాకాలనీలో కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు



గుల్లలపాలెంలో పోషకాహార కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ లావణ్య తదితరులు

మల్కాపురం: ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందని నాయకులు చెప్పారు. దీనిలో భాగంగా 10 రకాల పదార్థాలతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తుందన్నారు. శనివారం కూడా పలువార్డుల్లో కిట్ల పంపిణీ ఉత్సాహంగా సాగింది. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు,నాయకులు జీవీఎల్ నరేష్, ఆదారి హరీష్,బిల్డర్ శ్రీను,మళ్ల ధనలత, పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు.

● 58వ వార్డు గుల్లలపాలెం సామాజిక భవనం వద్ద జరిగిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య,కోరమాండల్ సంస్థ జీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాస్‌రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటరమణ,డాక్టర్ హేమంత్,ధర్మాల వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

90వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రసాద్, డాక్టర్ దీపిక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, టీచర్ ఉమ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: తమకు వేతనాలు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు ప్రకాష్‌రావు తదితరులు ములగాడ తహసీల్దార్ వీరభద్రరావును శనివారం కలిసి వినతి పత్రం అందించారు. ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ గత నెలలో సుమారు 55 వేల మంది ఉపాధాయులకు బదిలీలు జరిగాయన్నారు. అలాగే ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో రామలింగరావు,వాసు తదితరులు ఉన్నారు.

సేవా పథంలో 20 ఏళ్లు



సర్వసభ్య సమావేశంలో జనతా కాలనీ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు విమల, ఇతర సభ్యులు

గోపాలపట్నం: గత 20 ఏళ్లుగా సేవా పథంలో ముందుకు సాగుతున్నామని 92వ వార్డు జనతా కాలనీ మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు ఎం.విమల తెలిపారు. జనతా కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు సభ్యులంతా కృషి చేశామన్నారు. శనివారం కాలనీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఆమె మాట్లాడారు. 20 ఏళ్లుగా కాలనీ అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనుల గురించి చర్చించారు. మహిళల అభ్యున్నతికి అంతా కలిసికట్టుగా కృషి చేస్తామని తీర్మానించారు. సంఘ మాజీ అధ్యక్షురాలు కె.కె.లక్ష్మి మాట్లాడుతూ జనతా కాలనీ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి వాటిని పరిరక్షించాలని సూచించారు. మాజీ ప్రధాన కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ జనతా కాలనీ నుంచి నందమూరి నగర్‌కు రహదారి ఏర్పాటు చేయాలని, మహిళల కోసం సామాజిక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బలివాడ రమాకుమారి, బొజ్జ వెంకటలక్ష్మి, భారతి, దాసరి శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ సుధ తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రియదర్శినికాలనీలో సామాజిక భవనం మరమ్మతులతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు జీవీఎస్ఎన్.రాజు (కేబుల్ వాసు),సోనూ,కొల్లి నూకరెడ్డి,చట్టి నూకరాజు యాదవ్ పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణ పనుల పరిశీలన

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో నిర్మిస్తున్న రజక సామాజిక భవన పనులను వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య శనివారం పరిశీలించారు. జీవీఎంసీ వర్క్స్ ఇన్‌స్పెక్టర్,కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. భవన నిర్మాణ పనులు వేగవంగా జరపాలని సూచించారు. అనుకున్న సమయానికి భవనం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.నాయకులు జి.కృష్ణ, సత్యానందం, కోటా కృష్ణ పాల్గొన్నారు.

షిప్‌యార్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



షిప్‌యార్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న కార్మిక సంఘాల నాయికులు

సింథియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్–2023 ఎన్నికలు శనివారం సజావుగా పూర్తయ్యాయి. యాజమాన్యం నియమించిన ఎన్నికల అధికారి ఎంవీవీఎస్ గుప్తా ఆధ్వర్యంలో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా సదాశివరావు, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా విజయానంద ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ షిప్‌యార్డ్ అధికారుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేయడం వల్ల సభ్యులు మళ్లీ అదే బృందాన్ని రెండో సారి ఎన్నుకున్నారన్నారు. సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి భవిష్యత్తులో మరింత కృషి చేస్తామన్నారు. షిప్‌యార్డ్ అధికారులు, కార్మిక వర్గం, కార్మిక సంఘాలు వీరి ఎన్నికపై హర్షం వ్యక్తం చేస్తూ సభ్యులను అభినందించారు.

మహిళలపై హింసను అరికట్టాలి

మల్కాపురం: దేశంలోని పలు రాష్ట్రాల్లో మహిళలపై హింస పెరుగుతుందని, దీన్ని నివారించాల్సిన కేంద్ర ప్రభుత్వం మౌనం వహిస్తుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.విమల ఆవేదన చెందారు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద శనివారం మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళా పోరు బస్సు యాత్ర గత నెల 28 నుంచి ఈనెల 8వ తేదీ వరకు జరుగుతుందన్నారు.8న విజయవాడలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ సభకు ఐద్వా జాతీయ నాయకురాలు బృదాకరత్, పుణ్యవతిలు పాల్గొంటారన్నారు.విజయవాడలో జరిగే భారీ సభకు మహిళలుతరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు కల్యాణి,విజయలక్ష్మి,వరలక్ష్మి, రాజేశ్వరి,ఉమా, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



శ్రీనివాసరావు (ఫైల్)

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం వేణుగోపాలస్వామి ఆలయం సమీపంలో జియో ఫైబర్ సబ్ కాంట్రాక్ట్ తీసుకొని పనులు చేయిస్తున్న రెడ్డి శ్రీనివాసరావు(26) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం సమీపంలోని పతివాడపాలేనికి చెందిన శ్రీనివాసరావు ఒక్కడే మూడు నెలలుగా ఇక్కడ అద్దెకు ఉంటున్నారు. స్వగ్రామం నుంచి శుక్రవారం రాత్రి తిరిగి వచ్చాడు. తన వద్ద పనిచేసే యువకులకు ఫోన్ చేసి నేను వచ్చేశాను.. మీరు ఈ రాత్రికే తొందరగా రావాలని ఫోన్‌లో చెప్పాడు. రాత్రి 12 గంటల సమయంలో వచ్చిన యువకులు తలుపు కొట్టినా తీయకపోవడంతో ఫోన్ చేశారు. అయినా స్పందించక పోవడంతో నిద్రలో ఉన్నారనుకుని మేడపై నిద్రించారు. ఉదయాన్నే లేచి మళ్లీ తలుపు కొట్టినా తీయలేదు. దీంతో ఇంటి యజమానికి సమాచారమిచ్చారు. ఇంటి యజమాని వెనుక వైపు ఉన్న కిటికీ తలుపులు విరిచి చూసే సరికి శ్లాబ్ హుక్కుకు తాడుతో ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే 100కి, కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి ఎయిర్‌పోర్టు పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. ఘటనా స్థలంలో బీరు సీసాలు, తినుబండారాలు ఉన్నాయి. మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతునికి తల్లి, తండ్రి, ఇద్దరు అక్కలు ఉన్నారు. అయితే మృతికి గల కారణాలు తెలియరాలేదు. తండ్రి రెడ్డి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఆదర్శంగా నిలవాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న సీఐ జి.డి.బాబు

మల్కాపురం: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఆదర్శంగా నిలవాలని మల్కాపురం సీఐ జి.డి.బాబు ఆకాంక్షించారు. సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం డిగ్రీ థర్డ్ ఇయర్ విద్యార్థినుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని చెప్పారు. పలు అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులను సీఐ జి.డి.బాబు అభినందించి, జ్ఞాపికలు, బహుమతులను అందించారు.

తాగునీటి బోరు ప్రారంభం

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం సీతారామ మందిరం ఆవరణలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శనివారం కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ ప్రారంభించారు. శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందించారు. త్వరలోనే అభివృద్ధి పనులు జరిగేటట్లు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు.

సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

కంచరపాలెం: పేదల ఆకలి తీర్చడంలో కలిగే ఆనందం గొప్పదని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు అన్నారు. కంచరపాలెం రాంజీ ఎస్టేట్‌లో రాంజీ అభ్యుదయం సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాంజీ అభ్యుదయ సంఘం చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలతోపాటు ప్రతి శనివారం పేదలకు అన్నదానం చేయడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో దళిత సేన కార్యదర్శి పట్నాల ఝాన్సీ, నగర కన్వీనర్ గొల్లమాల మీనా, నగర అధ్యక్షుడు పుచ్చా కామేశ్వరరావు, సీతారామ్ పాల్గొన్నారు.